ఎల్కతుర్తి : జీల్గులలో ఇండ్ల కోసం అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజలు

ఐనవోలు : కొండపర్తిలో గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకుల మధ్య తోపులాట

వరంగల్ : పిల్లలను ఎత్తుకొని క్యూలో ఉన్న మహిళలు

ధర్మసాగర్ : ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న రాపాకపల్లె గ్రామస్తులు

గ్రామసభల్లో గందరగోళం

- లిస్టులో పేర్లు లేకపోవడంతో పేదల ఆందోళన
- అనర్హులకు పథకాలు ఇస్తున్నారని అధికారులపై ఆగ్రహం
- పేదలకు న్యాయం చేయరా? అని నిలదీత

కమలాపూర్, జనవరి 23 : కానిపర్తి గ్రామంలో అధికారులపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని కానిపర్తి, భీంపల్లి, మర్రిపల్లిగూడెం, శంభునిపల్లి, శ్రీరాములపల్లి గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో అధికారులు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా పథకాలపై పేర్లు చదివి వినిపించారు. దీంతో ఉన్నోళ్ల పేర్లే లిస్టులో వచ్చినయి. లేనోని పేర్లు లేవు. ఇందిరమ్మ ఇండ్లు భూమి, ఇల్లు ఉన్నోళ్ల పేర్లే వచ్చాయి. పేదోనికి ఎప్పుడిస్తరని అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో అధికారులు ఇదే లిస్టు ఫైనల్ కాదని, మళ్లీ జాబితాను వెరిఫికేషన్ చేస్తామన్నారు. గ్రామసభలు ఎందుకు పెట్టిండ్రు అని నిలదీశారు. అధికారులు సమాధానం చెప్పలేక ఉక్కిరిబిక్కిరయ్యారు. ఎంపీడీవో బాబు, ఎంపీవో రవి, పీఆర్ఏఈ మధు, సీఐ హరికృష్ణ పాల్గొన్నారు.

నీరుకుళ్లలో అధికారుల నిలదీత..

ఆత్మకూరు : ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేదలకు అందజేయాలని నీరుకుళ్ల గ్రామ సభలో అధికారులను నిలదీశారు. తమకు సంక్షేమ పథకాలు రాలేదని అర్హులు అడుగుతుంటే, సీఐ సంతోష్ జోక్యం చేసుకోవడం ఏంటని అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీవో విమల, పంచాయతీ కార్యదర్శి జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా, అర్హులకు సంక్షేమ పథకాలు అందుతాయని డీఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. గూడెప్పాడ్, కొత్తగట్టు, నాగయ్యపల్లి గ్రామసభలకు ఆయన హాజరయ్యారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి మహేందర్, కార్యదర్శి క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

ఎన్నిసార్లు దరఖాస్తులు పెట్టుకోవాలి..

శాయంపేట : ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఎన్నిసార్లు పేదలు దరఖాస్తులు పెట్టుకోవాలని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నించారు. శాయంపేటలో జిల్లా నాయకుడు గంటా శ్యాంసుందర్‌రెడ్డి, మైలారం మాజీ సర్పంచ్ ఆరికిల్ల ప్రసాద్, శాయంపేట ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ మాట్లాడుతూ.. ప్రజలకు మాయ మాటలు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం మభ్యపెడుతున్నట్లు ఆరోపించారు. కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకు మాత్రమే సంక్షేమ పథకాలు అందేలా చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో శాయంపేట గ్రామ అధ్యక్షుడు గాజ రాజేందర్, అరికెళ్ల దేవయ్య పాల్గొన్నారు.

జాబితాలో మరణించిన వారి పేర్లు..

మండలంలోని గంగిరేణిగూడెం, ప్రగతిసింగారం, కాట్రపల్లి, సూరంపేట, నూర్జహాన్‌పల్లి గ్రామాల్లో సభలు నిర్వహించారు. గంగిరేణిగూడెం సభకు ఎంపీడీవో ఫణిచంద్ర, జిల్లా సంక్షేమ అధికారి జయంతి హాజరయ్యారు. 39మంది ఆత్మీయ భరోసా లబ్ధిదారుల పేర్లు చదివి వినిపించారు. అయితే ఇందులో ఇద్దరు చనిపోయిన వారి పేర్లు ఉండడంతో గ్రామస్తులు అధికారులను ప్రశ్నించారు. గుంట భూమి లేద

డైనేజీ సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని నిలదీస్తున్న కాలనీవాసులు

ని, కూలి చేసుకునే తమ పేర్లు ఎందుకు ఇయ్యలేదని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్ల జాబితాలోను ఇండ్లు కూలిపోయిన తమ పేర్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మృతి చెందిన వారి పేర్లను అప్‌డేట్ చేయలేదని ఎంపీడీవో వివరించారు. ప్రజల నుంచి ప్రశ్నలు ఎదురవుతుండడంతో అధికారులు మధ్యలోనే సభ నుంచి వెళ్లిపోయారు.

ముసాయిదా సర్వేకు సభ ఎందుకు?

భీమదేవరపల్లి : ముసాయిదా సర్వే కోసం గ్రామ సభలు ఎందుకు నిర్వహిస్తున్నారని అధికారులను వంగర గ్రామసభలో గ్రామస్తులు నిలదీశారు. వంగర, రత్నగిరి, ముస్తఫాపూర్, మల్లారం, వీరభద్రనగర్, విశ్వనాథకాలనీ, వీర్లగడ్డ తండా, ముత్తారం గ్రామాల్లో సభలు నిర్వహించారు. ముసాయిదా జాబితా అయితే గ్రామసభలు ఎందుకు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికే చాలాసార్లు అర్జీలు పెట్టుకున్నామని, జాబితాలో పేర్లు రానివాళ్లు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంలో ఆంతర్యం ఏమిటని నిలదీశారు. ఈ లిస్టు ఫైనల్ కాదని, సమగ్ర విచారణ జరిపిన తర్వాతే తుది జాబితా ప్రకటిస్తామని డీఆర్డీవో ఏపీడీ శ్రీనివాసరావు బదులిచ్చారు.

రసాభాసగా గ్రామ సభలు

ఎల్కతుర్తి : దండేపల్లి, గోపాల్‌పూర్, జగన్నాథపూర్, జీల్గుల, కేశవాపూర్, రామకృష్ణాపూర్, తిమ్మాపూర్ గ్రామాల్లో అధికారులు సభలు నిర్వహించారు. ఇందులో ముఖ్యంగా గోపాల్‌పూర్, జీల్గుల, దండేపల్లి, కేశవాపూర్ గ్రామాల్లో భూమి లేని పేదలకు ఆత్మీయ భరోసా కింద రూ.12వేలు ప్రకటించినా అర్హులను ఎంపిక చేయలేదని, ఇండ్లు ఉన్న వారికే ఇండ్లు కేటాయించి, నిరుపేదలను ఎంపిక చేయలేదని అధికారులను ప్రశ్నించారు. అద్దె ఇండ్లల్లో ఉంటున్న వారి ఫొటోలు తీసుకొని సొంత ఇండ్లల్లో ఉంటున్నట్లు అధికారులు చూపారని, దీంతో తమకు ఇండ్లు రాలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇండ్ల ఎంపిక కాంగ్రెస్ నాయకులు చేస్తున్నారా? ఇందిరమ్మ కమిటీ, అధికారులు చేస్తున్నారా? అని ప్రజలు ప్రశ్నించారు. జగన్నాథపూర్ లాంటి గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులే ముందుండి సభలను నడిపించడం, అధికారులు అతిత్వరగా సభలు ముగించడంపై ప్రజలు అస

శాయంపేట : మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

హనం వ్యక్తం చేస్తున్నారు.

ఎంపీడీవోకు రాపాకపల్లె గ్రామస్తుల ఫిర్యాదు..

ధర్మసాగర్ : మండలంలోని రాపాకపల్లె గ్రామానికి చెందిన పలువురు అర్హులకు పథకాలు అందలేదని, అవకతవకలు జరిగాయని ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. కందుకూరి సుధాకర్, వినోద్, కృష్ణంరాజు, శ్రీనివాస్, సతీశ్ పాల్గొన్నారు.

పేర్లు రాలేదని గ్రామస్తుల ఆగ్రహం..

వేలేరు : ఇందిరమ్మ ఇండ్ల అర్హుల లిస్ట్‌లో తమ పేర్లు రాలేదని పలువురు గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పీచర, చింతలతండా, సోడాషపల్లి గ్రామాల్లో సభలు నిర్వహించారు. పీచరలో జరిగిన గ్రామసభలో గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. గ్రామసభ నుంచి అధికారులు వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. ఎంపీడీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ కొమి, ఆర్ఐ సురేందర్, ఏవో లలిత పాల్గొన్నారు.

కొండపర్తి గ్రామసభలో తోపులాట

ఐనవోలు : కొండపర్తి ప్రజాపాలన గ్రామసభలో గ్రామస్తులు, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకుల మధ్య తోపులాట జరిగింది. నర్సింహులగూడెం, ముల్కలగూడెం, వనమాలకనపర్తి, వెంకటాపురం, కొండపర్తి గ్రామాల్లో సభలు జరిగాయి. లిస్టుల్లో స్లాబ్ ఉన్న వారి పేర్లు వచ్చాయి. అసలే ఇండ్లు లేక కిరాయిలకు ఉంటున్న వారి పేర్లు రాలేదని, రేషన్ కార్డులు కొంతమందికే వచ్చాయంటూ అధికారులపై ప్రజలు ప్రశ్నల వర్షం కురిపించారు. కొండపర్తిలో కొత్త రేషన్‌కార్డుల కోసం సుమారు 512 మంది దరఖాస్తులు చేసుకుంటే.. 79 మంది పేర్లు చదవడంతో సభలో గందరగోళం నెలకొంది. ఇందిరమ్మ ఇండ్ల కోసం 1,250 మంది దరఖాస్తు చేసుకోగా, అందులో 506 మందికి వెరిఫికేషన్ పూర్తి అయిందని చదివి వినిపించారు. లిస్టులో పేదల పేర్లు రాలేదని అధికారులను నిలదీశారు. దీంతో ఓ సొసైటీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు ప్రశ్నిస్తున్న గ్రామస్తులు, ప్రతిపక్ష నాయకులతో వాగ్వాదానికి దిగారు. దీంతో గ్రామస్తులు, ప్రతిపక్ష నాయకులు, కాంగ్రెస్ నాయకుల మధ్య తోపులాట జరిగింది. దీంతో ఎస్సై నాయకులను చెదరగొట్టారు. ఇండ్ల లిస్టులో పేర్లు వచ్చిందని గ్రామస్తుల దగ్గర నుంచి కాంగ్రెస్ నాయకులు డబ్బులు వసూళు చేస్తున్నట్లు ఆరోపించారు. వేదిక పైకెక్కిన కాంగ్రెస్ నాయకులు గ్రామ ప్రత్యేకాధికారి డీఈ శంకర్‌చౌహాన్‌కు దిశానిర్దేశం చేస్తూ గ్రామ సభను కాంగ్రెస్ పార్టీ సభగా మార్చినట్లు ప్రతిపక్ష నాయకులు ఆరోపించారు. దర్గా సొసైటీ వైస్ చైర్మన్ మదాసు బాబును వేదికపైన కూర్చోబెట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారులతో మాట్లాడుతుంటే ఎస్సై, పోలీసులు జులుం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏవో సునీల్‌కుమార్‌రెడ్డి, ఆర్ఐ మల్లయ్య పాల్గొనారు.

నడికూడ : మండలంలోని నడికూడ, పులిగిల్ల, నార్లాపూర్, కౌకొండ గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో ప్రజలు పథకాల అమలుపై నిలదీయడంతో అధికారులు సమాధానం చెప్పలేక అసహనం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలే లబ్ధి పొందుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, వచ్చే ఎలక్షన్‌లో గుణపాఠం చెబుదామని హెచ్చరించారు. పోలీసులు జోక్యం చేసుకొని సర్ది చెప్పినా ప్రజలు వినలేదు. మండల స్పెషలాఫీసర్ నవీన్ కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో చేతన్ కుమార్, ఏవో పోరిక జైసింగ్ పాల్గొన్నారు.

మూడు రోజుల్లో 37,953 దరఖాస్తులు..

వరంగల్ : గ్రేటర్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న వార్డు సభల్లో ఇప్పటి వరకు 37,953 దరఖాస్తులు వచ్చాయి. కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. 25,182 రేషన్ కార్డులు, 12,771 దరఖాస్తులు ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చాయి. అలాగే పశ్చిమ నియోజవర్గంలో 6,9,31,50,57,58 డివిజన్లు, వర్ధన్నపేట నియోజవర్గంలోని 46,65వ డివిజన్లలో శుక్రవారం సభలు జరుగనున్నాయి.

చంటి పిల్లలతో క్యూలో మహిళలు..

బల్దియాలో ప్రజా పాలన రద్దీ కనిపిస్తోంది. దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాటు చేసిన కౌంటర్ వద్ద వందల సంఖ్యలో జనం క్యూ కడుతున్నారు. కొందరు మహిళలు చంటి పిల్లలను ఎత్తుకొని గంటల తరబడి క్యూలో నిల్చున్నారు. వార్డు సభల్లో కేవలం కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు మాత్రమే తీసుకుంటుండడంతో ఇతర సంక్షేమ పథకాల కోసం బల్దియా కార్యాయానికి వస్తున్నారు.

డైనేజీ సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే నిలదీత..

హనుమకొండ చౌరస్తా : 8వ డివిజన్ ఇందిరానగర్ హాస్టల్ సమీపంలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, మోరీలు నిండిపోయి రోడ్లపైకి మురుగు నీళ్లు వస్తున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యలను అసలు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని నిలదీశారు. గుడిబండల్ వద్ద స్మార్ట్‌సిటీ కింద రూ.కోటితో టైలర్ స్ట్రీట్ వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే నాయిని, మేయర్ గుండు సుధారాణి శంకుస్థాపన చేశారు. కాలనీవాసులు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, పింఛన్లు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై ఎమ్మెల్యేను నిలదీశారు. కాలనీలో నెలకొన్న సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్, మాజీ కార్పొరేటర్లు పుప్పాల ప్రభాకర్, వీరగంటి రవీందర్, నాయకులు రాజు, సతీశ్, వంశీ, సందీప్ పాల్గొన్నారు.

ఆత్మకూరు : గ్రామసభలో మాట్లాడుతున్న సీఐ సంతోష్‌కుమార్

నడికూడ : అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

సంక్షేమ పథకాలపై అపోహలు వద్దు

5వ డివిజన్ వార్డు సభలో ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ చౌరస్తా/కాజీపేట/హనుమకొండ, జనవరి 23 : ప్రభుత్వ పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని, అర్హులందరికీ వస్తాయని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ 5వ డివిజన్‌లో, 48వ డివిజన్ దర్గా గ్రామ పంచాయితీ కార్యాలయ ఆవరణలో, 62వ డివిజన్ సోమిడి కమ్యూనిటీ హాల్‌లో, 60వ డివిజన్ టీచర్స్‌కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన వార్డు సభల్లో మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్ దాస్యం అభినవ భాస్కర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు రానివారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ ప్రావీణ్య, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, స్థానిక కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ, మాజీ కార్పొరేటర్లు తాడిశెట్టి విద్యాసాగర్, కార్పొరేటర్ స్వామిచరణ్, వీరగంటి రవీందర్, డిప్యూటీ కమిషనర్ రవీందర్, తహసీల్దార్ బావుసింగ్, కార్పొరేటర్లు షాహ్తాజ్ బేగం, జక్కుల రవీందర్ యాదవ్ పాల్గొన్నారు.

ఎడ్ల బండి పైనుంచి పడి రైతు మృతి

ఆత్మకూరు, జనవరి 23 : నీరుకుళ్ల గ్రామానికి చెందిన రైతు బుద్దె రాంబాబు(48) వ్యవసాయ బావి నుంచి ఎడ్ల బండిపై వస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. రాంబాబుకు గ్రామ పొలిమేరలో వ్యవసాయ భూమి ఉంది. ఎడ్ల బండిపై ధాన్యం బస్తాలు తీసుకోస్తున్న క్రమంలో చెరువు కట్టపై ఎత్తువంపులుగా ఉన్న దారిపై బండి వెళ్లడంతో పైనుంచి ఎగిరి పడ్డాడు. దీంతో ఎడ్ల బండి చక్రం అతడిపై నుంచి వెళ్లింది. స్థానికులు 108 అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరిలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడన్నారు. తండ్రి బుచ్చయ్య గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

దుర్గామాత విగ్రహం చోరీ

వరంగల్, జనవరి 23 : ములుగు రోడ్డులోని ఇండస్ట్రియల్ ఏరియాలో దుర్గామాత విగ్రహం చోరీకి గురైంది. మూడు నెలల క్రితం ఇక్కడ తవ్వకాల్లో దుర్గామాత విగ్రహం బయట పడింది. అప్పటి నుంచి స్థానికులు దుర్గామాత విగ్రహానికి ప్రతి రోజూ పూజలు చేస్తున్నారు. గురువారం పూజలు చేసేందుకు వచ్చిన స్థానికులకు విగ్రహం కనిపించపోవడంతో అవాక్కయ్యారు. విషయం తెలుసుకున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

వేలేరు, జనవరి 23 : వేలేరు మండలం పీచర గ్రామానికి చెందిన మాతంగి ఉప్పలయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించారు. అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నియోజకవర్గ ఎస్సీ సెల్ కో ఆర్డినేటర్ కొయ్యడ మహేందర్ గురువారం ఉప్పలయ్య కుటుంబ సభ్యులకు 50కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీందర్, మండల కన్వీనర్ రాజు, నాయకులు జానీ, కల్యాణ్ పాల్గొన్నారు.

హోమ్ స్టే నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ, జనవరి 23 : గ్రామీణ, గిరిజన, పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకుల విడిది కోసం హోమ్ స్టే నిర్వహణకు పర్యాటక శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖాధికారి శివాజీ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ధర్తి ఆబ జనజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్'లో భాగంగా పర్యాటక ప్రాంతాలు, గ్రామీణ గిరిజన ప్రాంతాలకు వచ్చే పర్యాటకులకు ఇంటిలోనే తాత్కాలిక ఆతిథ్యం కల్పించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పర్యాటకులకు అన్ని సదుపాయాలతో కనీసం ఒక గది మొదలు పది గదుల వరకు స్టే ఇవ్వగలగాలని, హోమ్ స్టే విధి విధానాలు, మరిన్ని వివరాల కోసం www.telanganatourism.gov.inలో లేదా కలెక్టరేట్‌లోని పర్యాటక శాఖ కార్యాలయంలో లేదా 9866919131లో సంప్రదించాలని కోరారు.

ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ అడ్మిషన్ల తత్కాల్ గడువు పొడిగింపు

హనుమకొండ చౌరస్తా, జనవరి 23 : తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం అడ్మిషన్ల తత్కాల్ గడువును 27 నుంచి 29వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి, వరంగల్ ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ అనగోని సదానందం తెలిపారు. ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో చేరేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన అభ్యర్థులు తమ సమీపంలోని ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలల్లో సంప్రదించాలన్నారు. విద్యార్థులే స్వయంగా అడ్మిషన్ ఫీజును www.telanganaopenschool.org వెబ్‌సైట్ ద్వారా చెల్లించి రసీదు పొంది అధ్యయన కేంద్రాల్లో 29వ తేదీన సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు 9346020003, 80084 03631 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కానిస్టేబుల్ నాగేందర్‌తో ప్రాణహాని

హనుమకొండ చౌరస్తా, జనవరి 23 : 12వ బెటాలియన్ కానిస్టేబుల్ నాగేందర్ నుంచి తమకు ప్రాణహాని ఉన్నదని జీ న్యూస్ గంగా ప్రవాహం సీఈవో స్వప్న ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ.. నాగేందర్ దివ్యాంగురాలైన సక్కు రుపావత్‌ను ఫోన్ ద్వారా వేధిస్తున్నాడని, కానిస్టేబుల్ ఆకృత్యాలపై జీ న్యూస్ గంగా ప్రవాహం యూట్యూబ్ చానల్‌లో వీడియోని పోస్ట్ చేశాను. దీంతో నాగేందర్ సదరు అమ్మాయిపై వేధింపులు తీవ్రం చేశాడని, ప్రత్యక్షంగా నన్ను టార్గెట్ చేశాడని, వరంగల్‌లోని కొంత మంది వ్యక్తులతో పరిచయం ఏర్పరచుకొని, నన్ను అంతం చేసేందుకు కుట్రలు పన్నుతున్నాడని, భయాందోళనతో జీవనం గడుపుతున్నట్లు వాపోయారు. తమకు రక్షణ కల్పించాలని పోలీసులను ఆమె వేడుకున్నారు.

సభను విజయవంతం చేయాలి

కాజీపేట, జనవరి 23 : హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న జరిగే లక్ష డప్పులు-వేల గొంతులు సభను విజయవంతం చేయాలని మాదిగ మహాజనుల వేదిక మండల కన్వీనర్ గబ్బెట శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పట్టణంలో గురువారం మాదిగ మహాజనుల వేదిక ఏర్పాటు చేశారు. పార్టీలకు అతీతంగా మాదిగ కులస్తులు ఒక్కతాటి పైకి వచ్చి వర్గీకరణ జరిగేంత వరకు పోరాటం కొనసాగిద్దామని తీర్మానించారు. వేదిక నాయకులు బొల్లె కుమార్, అరూరి సాంబయ్య, కుమ్మరి కోటిలింగం, బస్కె కృష్ణ, కట్కూరి రవికుమార్, మేకల రవి పాల్గొన్నారు.

గంజాయి తాగుతున్న నలుగురి అరెస్ట్

కమలాపూర్, జనవరి 23 : మండలంలోని అంబాల గ్రామ శివారులో గంజాయి తాగుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ హరికృష్ణ గురువారం తెలిపారు. అంబాల-నేరెళ్ల రహదారిలో కంది శ్రీనివాస్‌రెడ్డి వెంచర్‌లో గంజాయి తాగుతున్న కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన జంపాల తరుణ్, సొతుకు అజయ్, రావుల మణిదీప్, నేరెళ్లకు చెందిన గోల్కొండ రాజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. హుజూరాబాద్‌కు చెందిన రక్షక్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. పట్టుబడిన వ్యక్తుల నుంచి 5గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్ సీజ్ చేసి కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సీఐ వెల్లడించారు.

స్థానిక సంస్థల్లో బీసీల పాత్రపై అవగాహన సదస్సు

హనుమకొండ చౌరస్తా, జనవరి 23 : వరంగల్ ఉమ్మడి జిల్లా ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 24న హనుమకొండలోని హరిత హోటల్‌లో 'స్థానిక సంస్థల్లో బీసీల పాత్ర, 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఫోరం రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ కూరపాటి రమేశ్ తెలిపారు. గురువారం హనుమకొండలోని కూరపాటి హాస్పిటల్‌లో అవగాహన సదస్సు పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫోరం కో ఆర్డినేటర్ డాక్టర్ వీరస్వామి, నాయకులు రాములు, దారం జనార్దన్, బుట్టి శ్యామ్‌యాదవ్, బగ్గి రాజు పాల్గొన్నారు.

మున్సిపల్ షట్టర్లకు అద్దె వేలం

వరంగల్, జనవరి 23 : గ్రేటర్ కార్పొరేషన్ కాశీబుగ్గ పరిధిలోని మున్సిపల్ షట్టర్ల అద్దె వేలం నిర్వహించారు. గురువారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో అదనపు కమిషనర్ జోనా ఆధ్వర్యంలో హెడ్ పోస్టాఫీస్ వద్ద 10 షట్టర్లు, పోచమ్మ మైదాన్ సెంటర్‌లోని 2 షట్టర్లకు అద్దె వేలం వేశారు. డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, పన్నుల అధికారి బిర్రు శ్రీనివాస్ పాల్గొన్నారు.

లిస్టులో పేర్లు రాలేదని ఆందోళన వద్దు

ఎమ్మెల్యే కడియం శ్రీహరి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

ధర్మసాగర్, జనవరి 23 : మండలంలోని క్యాతంపల్లి, నారాయణగిరి గ్రామాల్లో గురువారం సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. లిస్టులో పేర్లు లేని వారు ఆందోళన చెందొద్దని తెలిపారు. సమావేశంలో ఆర్డీవో రమేశ్ రాథోడ్, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్ కుమార్ పాల్గొన్నారు.

కేయూ అధ్యాపకురాలికి యంగ్ సైంటిస్ట్ అవార్డు

హనుమకొండ చౌరస్తా, జనవరి 23 : కాకతీయ విశ్వవిద్యాలయ బయో టెక్నాలజీ విభాగ ఒప్పంద అధ్యాపకురాలు తిప్పని రాధిక 'యంగ్ సైంటిస్ట్ అవార్డు-2024' అందుకున్నారు. ఉత్తరప్రదేశ్ ఆలీఘర్‌లోని సొసైటీ ఫర్ ప్లాంట్ రీసెర్చ్ సంస్థ రాధికకు ప్రశంసాపత్రంతో పాటు జ్ఞాపిక అందజేసింది. కాగా, రాధికను కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి అభినందించారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి

కాజీపేట, జనవరి 23 : పట్టణంలోని సోమిడిలో ముదిరాజ్ కుల సంక్షేమ సంఘం, బీజేపీ ఆధ్వర్యంలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు నిర్వహించారు. ముదిరాజ్ కుల సంఘం అధ్యక్షుడు సుంచు చంద్రయ్య, బీజేపీ 62వ డివిజన్ అధ్యక్షుడు మేకల శ్రావణ్ యాదవ్ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో సుంచు అశోక్, సుంచు విజయ్, శ్రీహరి, రఘురాం, రామ్మూర్తి, మోడెం రాజేశ్ గౌడ్, సుంచు ప్రశాంత్, కరుణాకర్, భరత్, యాదగిరి పాల్గొన్నారు.

కేయూలో 'పరాక్రమ్ దివస్' 2కే రన్..

హనుమకొండ చౌరస్తా : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కేయూ శాఖ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి 'పరాక్రమ్ దివస్' సందర్భంగా విశ్వవిద్యాలయ మొదటి గేటు నుంచి రెండో గేటు వరకు 2కే రన్ నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు, హృద్రోగ వైద్యనిపుణులు భగీరథ్, జనరల్ ఫిజీషియన్ మేఘన నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్, ఇన్‌చార్జి నిమ్మల రాజేశ్, విభాగం సంఘటన మంత్రి హర్షవర్ధన్, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అంబాల కిరణ్ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలనకు కృషి

హనుమకొండ, జనవరి 23 : మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలనకు అందరం కలిసి పని చేద్దామని ఆర్డీవో రమేశ్ రాథోడ్ అన్నారు. గురువారం ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో డైరెక్టర్ సిస్టర్ సహాయ అధ్యక్షతన సుబేదారిలోని అసంత భవన్‌లో హనుమకొండ, మహబూబాబాద్, జనగామ ములుగు జిల్లాల ఎన్జీవో ప్రతినిధులకు వర్క్‌షాప్